క్లుప్తంగా

కాలుష్య రహిత విశాఖ లక్ష్యం



జీవీఎంసీ కార్యాలయానికి ఆర్టీసీ బస్సులో వెళ్తున్న మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు నగర ప్రజలు సహకరించాలని మేయర్ గొలగాని హరివెంకటకుమారి కోరారు. కాలుష్య నిర్మూలనలో భాగంగా మేయర్ సోమవారం తన క్యాంపు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వచ్చిన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలుష్య రహిత విశాఖ లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. నగర ప్రజలు సాధ్యమైనంత వరకు ప్రజా రవాణాన్ని ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు.

అయ్యప్ప స్వాములకు ఉచిత భిక్ష

ఆరిలోవ: అయ్యప్ప స్వాములకు చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో సోమవారం ఉచిత భిక్ష కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ఆలయ ట్రస్ట్ చైర్మన్ వానపల్లి అప్పారావు, గురుస్వామి గణేష్, అన్నపూర్ణ ఎలక్ట్రికల్ ప్రాజెక్టు యజమాని ఏగిరెడ్డి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వానపల్లి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అయ్యప్ప స్వాములకు ఉచితంగా భిక్ష పెడుతున్నట్లు తెలిపారు. సంక్రాంతి వరకు ఈ కార్యక్రమం కొనసాగిస్తామన్నారు. రోజూ 200 మంది స్వాములకు ఇక్కడ భిక్ష అందుబాటులో ఉంటుందన్నారు. ముందుగా అయ్యప్ప స్వామికి అర్చకులు నగేష్ శర్మ, ప్రభాష్ స్వాములు పూజలు చేశారు. అనంతరం సీనియర్ స్వాములను సత్కరించారు.

విశాఖలో సీజీహెచ్‌ఎస్ సెంటర్ ఏర్పాటుకు వినతి

ఎంవీపీ కాలనీ: విశాఖ కేంద్రంగా సీజీహెచ్‌ఎస్ స్టేట్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శికి బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు వినతిపత్రం అందజేసినట్లు ఎంపీ కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుతం విశాఖలో ఉన్న సీజీహెచ్‌ఎస్ అందిస్తున్న సేవలు సరిపోవని, సంస్థ ఏపీ స్టేట్ డైరెక్టరేట్ కేంద్రాన్ని విశాఖలో ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపింది. విశాఖ కేంద్రంగా సేవలందిస్తూ మరిన్ని వెల్‌నెస్ సెంటర్లు ప్రారంభించే దిశగా ఆరోగ్యశాఖ కార్యదర్శికి జీవీఎల్ విన్నవించినట్లు పేర్కొంది.

ఓటీఎస్ డబ్బులు వెనక్కి ఇవ్వాలి

ఆరిలోవ : ఒన్ టైం సెటిల్‌మెంట్(ఓటీఎస్) డబ్బులు వెనక్కి తిరిగి ఇచ్చేయాలని జీవీఎంసీ 13వ వార్డు తొమ్మిదో నంబరు సచివాలయం సిబ్బందిని సోమవారం కొందరు స్థానికులు అడ్డుకున్నారు. శివాజీనగర్–2లో నలభై గజాల నివాసితులు 12 మంది ఓటీఎస్ పద్ధతిలో ఇళ్ల పట్టా కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకోసం రూ.20 వేలు చొప్పున సచివాలయం ద్వారా చెల్లించారు. అయితే ఇప్పటికీ ఇళ్ల పట్టాలు రాలేదు. దీంతో సోమవారం ఆ 12 మంది బాధితులు సచివాలయం గేటు తాళం తీయకుండా సిబ్బందిని అడ్డుకున్నారు. సుమారు గంటకు పైగా సచివాలయం తాళం తీయనీయకుండా వాగ్వాదానికి దిగారు. అనంతరం సచివాలయం సిబ్బంది రూరల్ రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. వారి సూచనలతో మంగళవారం దీనిపై స్పష్టంగా తెలియజేస్తామని చెప్పడంతో బాధితులు శాంతించి వెళ్లిపోయారు.

సాయి కౌశిక్‌కు అభినందన

ఎంవీపీ కాలనీ: వరల్డ్ క్రాస్ బోర్డు షూటింగ్‌లో ప్రతిభ కనబరిచిన విశాఖ క్రీడాకారుడు సాయి కౌశిక్‌ను ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అభినందించారు. ఇటీవల ఆగ్రాలో జరిగిన క్రీడల్లో రజత పతకం సాధించిన కౌశిక్ సోమవారం మర్యాద పూర్వకంగా లాసన్స్‌బే కాలనీలోని ఎంపీ కార్యాలయంలో ఎంవీవీని కలిశారు. ఈ సందర్భంగా కౌశిక్‌ను ఎంపీ అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

'ఆరోగ్య సురక్ష'.. పేదలకు రక్ష



రేసపువానిపాలెంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు



ప్రజలకు మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

- 22వ వార్డులో 3,605 మందికి వైద్య పరీక్షలు
- చెంతనే వైద్యంతో ప్రజల్లో హర్షం

బీచ్ రోడ్డు: ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ప్రతి వార్డులో వారం రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేల సంఖ్యలో ప్రజలు తమ ఆరోగ్య సమస్యలను వైద్యుల దృష్టికి తీసుకెళ్లి ఉపశమనం పొందారు. 22వ వార్డు రేసపువానిపాలెం యూపీహెచ్‌సీలో సోమవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో స్థానిక ప్రజలు అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్య నిపుణులు పలు రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట ప్రజల చెంతకే వైద్య సేవలు తీసుకురావడంపై లబ్ధిదారులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. వైద్య పరీక్షలు చేయించుకున్నవారు సంతోషంగా ఇంటికి వెళ్లారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఇటువంటి కార్యక్రమాలు చేపడితే రాష్ట్ర ప్రజలంతా ఆరోగ్యంగా.. ఆనందంగా జీవిస్తారనే భరోసా కనిపిస్తోందన్నారు. వారం రోజులుగా సుమారు 3605 మంది రోగులకు పలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు యూపీహెచ్‌సీ వైద్యాధికారి తెలిపారు.

న్యాయం చేయాలని నిరసన



పోలీస్ కమిషనరేట్ ఎదుట నిరసన తెలియజేస్తున్న మనోజ్ కుటుంబ సభ్యులు

అల్లిపురం: తన కుమారుడు బొల్లంకి మనోజ్‌ను అన్యాయంగా చంపేసి, కార్ యాక్సిడెంట్‌గా చిత్రీకరించారని, తమకు న్యాయం చేయాలని కోరుతూ న్యూ రేసపువానిపాలేనికి చెందిన బొల్లింకల వరలక్ష్మి, బొల్లింకల వెంకటరమణ నగర పోలీస్ కమిషనర్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసనకు దిగారు. పోలీసులు వారిని స్పందన కార్యక్రమానికి పిలిపించి మాట్లాడారు. బాధితుల కథనం ప్రకారం.. గత సెప్టెంబర్ 23వ తేదీ రాత్రి వినాయక నిమజ్జనం నిమిత్తం మనోజ్‌ను స్నేహితులు తారక్, ఢిల్లీలు ఇంటి నుంచి తీసుకెళ్లారని, ఉదయం వరకు ఇంటికి రాలేదని పేర్కొన్నారు. ఉదయం ఢిల్లీ తమ ఇంటికి వచ్చి మీ అబ్బాయి కేజీహెచ్‌లో ఉన్నాడని చెప్పి తీసుకెళ్లగా.. అక్కడ తన కుమారుడు విగతజీవిగా పడిఉన్నాడని, ఏం జరిగిందని అడగ్గా.. వీఐపీ రోడ్డులో ఓ కారు మనోజ్‌ను ఢీకొని వెళ్లిపోవడంతో ఆస్పత్రికి తీసుకెళ్లామని చెప్పారన్నారు. తమ అబ్బాయి ఇంటికి దగ్గరలో గల ఒక అమ్మాయితో చనువుగా ఉండటంతో యువతి పెదనాన్నతో కలిసి చంపేసారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. మూడో పట్టణ పోలీసులతో తమ అనుమానాన్ని వెల్లడించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకోసమే తమకు న్యాయం చేయాలని సీపీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టామని తెలిపారు.

సింహాద్రిపురం సచివాలయం ప్రారంభం



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ ఎంవీవీ, 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య

మద్దిలపాలెం : జీవీఎంసీ 15వ వార్డులో సింహాద్రిపురం సచివాలయాన్ని సోమవారం ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ స్థానిక కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్యతో కలిసి ప్రారంభించారు. జీవీఎంసీ నిధులు రూ.10 లక్షలతో సచివాలయ భవనాన్ని ఆధునీకరించామని కార్పొరేటర్ శ్రీవిద్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి అప్పారి గిరిబాబు, సచివాలయ అడ్మిన్ గౌతం, రమేష్‌నాయుడు, లీలావతి, వరలక్ష్మి, వార్డు కన్వీనర్లు సత్తిబాబు, ఆర్జి వెంకటలక్ష్మి, త్రినాథరావు, బుగత ఏసురత్నం, తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో పేలుడు పదార్థాల రవాణా నేరం


తాటిచెట్లపాలెం: ప్రయాణికులు రైళ్లలో ప్రయాణించేటపుడు ఎట్టి పరిస్థితుల్లోనూ పేలుడు, మండే స్వభావం గల పదార్థాలను తమతో తీసుకువెళ్లరాదని, ఇది ప్రమాదకరమని, శిక్షార్హమైన నేరమని వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టపాసులు, గ్యాస్ సిలిండర్స్, ఏసిడ్, కిరోసిన్, పెట్రోల్ వంటి వాటిని రైళ్లలో, రైల్వే స్టేషన్లలోనికి తీసుకురావడం రైల్వే యాక్ట్ 1998 ప్రకారం నేరమని, ఇలా చేసిన వారికి మూడేళ్ల వరకు జైలు, జరిమానా విధించే అవకాశం ఉన్నట్లు తెలిపారు. దీపావళి సమీపిస్తున్న తరుణంలో వాల్తేర్ డివిజన్ వీటికి సంబంధించి ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీరితోపాటు సివిల్ డిఫెన్స్ సభ్యులు, టీటీఈలు, కోచ్ అటెండెంట్స్, ట్రైన్ మేనేజర్స్, స్టేషన్ మేనేజర్లు కూడా తరచూ తనిఖీలు చేపడతారన్నారు. ప్రయాణికుల సహాయం కోసం 139 నంబర్‌ను సంప్రదించాలని త్రిపాఠి కోరారు.

పలు రైళ్ల రీ షెడ్యూల్..

- బెంగళూరులో మంగళవారం ఉదయం 10.15 గంటలకు బయల్దేర వలసిన బెంగళూరు–అగర్తలా(12503) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ 24 గంటలు ఆలస్యంగా బుధవారం ఉదయం 10.15 గంటలకు బయల్దేరుతుంది.
- అలెప్పీలో మంగళవారం ఉదయం 6 గంటలకు బయల్దేరాల్సిన అలెప్పి–ధన్‌బాద్ (13352) బొకారో ఎక్స్‌ప్రెస్ సుమారు 5 గంటలు ఆలస్యంగా ఉదయం 10.45 గంటలకు బయల్దేరుతుంది.

కార్డ్ ప్రైమ్ 2.0తో రిజిస్ట్రేషన్లు సులభతరం

- స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డీఐజీ బాలకృష్ణ



అక్కయ్యపాలెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 2.0 అమలును పరిశీలిస్తున్న డీఐజీ బాలకృష్ణ

సీతంపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 2.0 విధానంలో రిజిస్ట్రేషన్లు చాలా సులభతరమవుతాయని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డీఐజీ బాలకృష్ణ తెలిపారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ నూతన రిజిస్ట్రేషన్ విధానం కార్డ్ ప్రైమ్ 2.0ను అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లోని ద్వారకానగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోమవారం ప్రారంభించారు. కార్యాలయంలో 2.0 అమలును ఆయన పరిశీలించారు. దీనిపై అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ కొత్త విధానంలో డాక్యుమెంట్ తయారీ, చలానా కట్టడం చాలా తక్కువ సమయంలో జరుగుతుందని, దీనివల్ల సులభంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. వినియోగదారులే స్వయంగా ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్ తయారు చేసుకోవచ్చని చెప్పారు. ఆస్తి వివరాలు, పేరు, ఆధార్, సాక్షులు వంటి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో ఎంటర్ చేస్తే సదరు ఆస్తి మార్కెట్ విలువ, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, యూజర్ చార్జీలు ఎంత కట్టాలో చూపిస్తుందన్నారు. కొత్త విధానంపై వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ రిజిస్ట్రార్ గోపీచంద్, సబ్ రిజిస్ట్రార్ డి.వి.నారాయణ, డీఆర్ సృజన, సీనియర్ అసిస్టెంట్ సాయి లక్ష్మి పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో బుల్లయ్య కళాశాలకు పతకాలు

సీతంపేట: ఇటీవల జరిగిన ఆంధ్రా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల బాక్సింగ్ పోటీల్లో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజీ విద్యార్థులు ప్రతిభ చూపారు. 51 కిలోల విభాగంలో తరుణ్‌కుమార్, 60 కిలోల విభాగంలో దిగ్విజయ్, 63.5 కిలోల విభాగంలో క్రాంతికిరణ్, +92 కిలోల విభాగంలో దినేష్‌కుమార్‌రెడ్డి బంగారు పతకాలు సాధించారు. అజయ్ 48 కిలోల విభాగం, ఎండీ అస్లాం 71 కిలోల విభాగం, భార్గవ్ సురేష్ 75 కిలోల విభాగంలో రజత పతకాలు సాధించారు. జి.దినేష్ 92 కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించాడు. పి.దిగ్విజయ్ బెస్ట్ బాక్సర్ అవార్డు అందుకున్నాడు. వీరిని సోమవారం కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అభినందించారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్య దైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేసి, సంప్రదించవచ్చు.

విద్యా సమాచారమ్

న్యాయ కళాశాలకు ఏసీ బహూకరణ



ప్రిన్సిపాల్‌కు ఏసీ బహూకరిస్తున్న విద్యార్థి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాల ఎల్ఎల్‌బీ చివరి సంవత్సరం విద్యార్థులు గొర్లె వంశీకిరణ్, కె.దివ్యవాణి కొత్త ఏసీని కొనుగోలు చేసి బహూకరించారు. సోమవారం ఏయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మిని కార్యాలయంలో కలసి ఏసీని అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ సలహా మండలి సభ్యురాలిగా ప్రసన్నశ్రీ



ప్రసన్నశ్రీని అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: భారత ప్రభుత్వ విద్యాశాఖకు చెందిన పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం నేషనల్ అడ్వయిజరీ కౌన్సిల్ సభ్యురాలిగా ఏయూ ఆంగ్ల విభాగం ఆచార్యురాలు ఎస్.ప్రసన్నశ్రీ నియమితులయ్యారు. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు ఆమెకు సోమవారం అందాయి. ఈ సందర్భంగా ఆచార్య ప్రసన్నశ్రీని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సోమవారం తన కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఓఎస్డీ ఆచార్య వి.కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



ఫ్యాషన్ షోలో విజేతలు

బీచ్ రోడ్డు: చిట్టిపొట్టి నడకతో.. ముద్దు ముద్దు మాటలతో.. వివిధ ఆకర్షణీయమైన వస్త్రాధారణతో చిన్నారులు సందడి చేశారు. నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం జరిగిన చిన్నారుల ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. ఈ పోటీల్లో 120 మంది చిన్నారులు పాల్గొనగా.. 50 మందిని ఫైనల్స్‌కు ఎంపిక చేశారు. కేటగిరి–1లో కె.హంసిని మొదటి బహుమతి, బి.కార్తికేయరెడ్డి, జోశ్విక రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. కేటగిరి–2లో పి.పర్ణిక ప్రథమ, ఎన్.చిరుదేవ్, సిహెచ్.హన్సిశ్రీలు రెండు, మూడు స్థానాల్లో నిలిచి సత్తా చాటారు. కేటగిరీ–3లో భాగ్యశ్రీ ప్రథమ బహుమతి, తస్విక, సుందర్‌లు ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి



యువకుడి మృతదేహం

తాటిచెట్లపాలెం: రైలు నుంచి జారిపడి ఆదివారం గుర్తు తెలియని ఒక యువకుడు మృతి చెందినట్లు విశాఖ గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపారు. వివరాలిలా.. సుమారు 25 ఏళ్ల వయసున్న యువకుడు మర్రిపాలెం నుంచి విశాఖ రైల్వే స్టేషన్‌కు వస్తున్న మార్గంలో రైలు నుంచి జారిపడి చనిపోయాడు. ఇతడి వద్ద ఏ విధమైన ఆధారాలు లేవు. కడుపు మీద కుడిచేతి వైపు పుట్టుమచ్చ ఉంది. చామన చాయ, సుమారు 5.6 అడుగుల ఎత్తు ఉన్నాడు. మరణించిన యువకుడు బ్లూ టీ షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నారు. కుడిచేతికి కడియం, మెడలో నల్లపూసల దండ ఉంది. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజనాయుడు ఆదేశాల మేరకు హెడ్‌కానిస్టేబుల్ డి.శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు విశాఖ రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీకి స్వయంగా గానీ లేదా 94406 27547, 79892 94775 నంబర్లలో తెలియజేయాలని పోలీసులు కోరారు.

ఉత్సాహంగా ప్రజా సంకల్పయాత్ర ఆరేళ్ల వేడుక



కేక్ కట్ చేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికలకు ముందు చేపట్టిన ప్రజా సంకల్పయాత్రకు సోమవారంతో ఆరేళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ నాయకులు లాసన్స్ బే కాలనీలోని ఎంపీ ఎంవీవీ కార్యాలయం జరిగిన ఈ వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. ఎంపీ, పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ కేక్ కట్ చేసి, పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 2017 నవంబర్ 6న ప్రారంభించిన ఈ యాత్ర చరిత్ర సృష్టించిందన్నారు. ఈ యాత్ర ద్వారా నేరుగా ప్రజల కష్టాలు తెలుసుకున్న వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక ప్రజారంజక పాలన సాగిస్తున్నారన్నారు. 2019 ఎన్నికల్లో అఖండ మెజారిటీతో అధికారంలోకి వచ్చారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చిన ముఖ్యమంత్రిగా సైతం చరిత్ర సృష్టించారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి, ప్రజా సంక్షేమం దిశగా కొత్తపుంతలు తొక్కిస్తున్నారని చెప్పారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సైతం 2019 ఫలితాలే పునరావృతమయ్యేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజలు అఖండ మెజారిటీని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, పలు కార్పొరేషన్ల చైర్మన్‌లు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లంలో పట్టు సాధించడం తప్పనిసరి



మాట్లాడుతున్న కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం : ఆంగ్లంలో పట్టు సాధించడం నేటి తరానికి ఎంతో అవసరమని, అందరూ ఆంగ్లంలో రాణించడానికి కృషి చేయాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అన్నారు. కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో సోమవారం వృత్తిలోను, జీవితంలో ఆంగ్ల భాషా నైపుణ్యానికి పట్టు అవసరం అనే అంశంపై ఆరు రోజుల వర్క్‌షాప్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనికేషన్‌కు ఆంగ్లం ఎంతో కీలకమన్నారు. ఆంగ్లంపై పట్టుకు వర్క్‌షాప్ ఎంతో దోహదపడుతుందన్నారు. అనంతరం ఆంగ్ల విభాగాధిపతి రావి రాణి, పి.పద్మప్రియ, ఎస్.వి.రామారావు, సి.వి.ఎస్.రవీంద్రనాథ్, టి.రామకృష్ణ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ కొనసాగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, సంస్కృత విభాగాధిపతి పోలా ఉమామహేశ్వరరావు, బి.లక్ష్మి, కుసుమ కుమారి పాల్గొన్నారు.

జిల్లా అధికారులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరాలకు జనాల నుంచి స్పందన బాగుందని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ మూర్తి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎం.పోలినాయుడు, డీఎల్ డీవో పూర్ణిమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల కోసం స్పెషల్ రైళ్లు

తాటిచెట్లపాలెం : ప్రయాణికుల సౌకర్యార్థం హైదరాబాద్ – కటక్ – హైదరాబాద్ (వయా దువ్వాడ మీదుగా) మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు.

- హైదరాబాద్ – కటక్ (07165) స్పెషల్ హైదరాబాద్‌లో ఈ నెల 7, 14, 21న (ప్రతీ మంగళవారం) రాత్రి 8.10 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 9.07 గంటలకు బయల్దేరి అదేరోజు సాయంత్రం 5.45 గంటలకు కటక్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కటక్ – హైదరాబాద్ (07166) స్పెషల్ కటక్‌లో ఈ నెల 8, 15, 22న (ప్రతీ బుధవారం) రాత్రి 10.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.35 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 7.37 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 9 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది.
- ప్రయాణికుల సౌకర్యార్థం పూర్తి జనరల్ కోచ్‌లతో కూడిన ఎర్నాకుళం ధన్‌బాద్ (06077) స్పెషల్ రైలు ఈ నెల 10న రాత్రి 11.55 గంటలకు ఎర్నాకుళంలో బయల్దేరి ఆదివారం తెల్లవారుజామున 1.45 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 1.50 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 11 గంటలకు ధన్‌బాద్ చేరుకుంటుంది. ఈ రైలు 22 జనరల్, 2 లగేజీ కం సెకండ్ క్లాస్ కోచ్‌లతో నడుస్తుంది.
- ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బెంగళూరు – న్యూ భువనేశ్వర్ – బెంగళూరు మధ్య జన సాధారణ్ స్పెషల్ రైలు నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు.

బెంగళూర్ – న్యూ భువనేశ్వర్ (06287) స్పెషల్ ఈ నెల 10న బెంగళూరులో తెల్లవారుజామున 4 గంటలకు బయల్దేరి అదే రోజు రాత్రి 10.38 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 10.40 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 6.30 గంటలకు న్యూ భువనేశ్వర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో న్యూ భువనేశ్వర్ – బెంగళూరు (06288) స్పెషల్ శనివారం ఉదయం 8.15 గంటలకు న్యూ భువనేశ్వర్‌లో బయల్దేరి అదేరోజు సాయంత్రం 4.15 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 4.17 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 10 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది.

రూ.1.25 కోట్ల ఆస్తి పన్ను వసూలు



జెడ్సీకి ఆస్తిపన్ను చెక్కును అందజేస్తున్న రెవెన్యూ విభాగం అధికారులు

గాజువాక : జీవీఎంసీ గాజువాక జోన్ రెవెన్యూ విభాగం అధికారులు సోమవారం రూ.1,25,57,825 ఆస్తి పన్ను వసూలు చేశారు. 69వ వార్డులోని ఈఎస్ఐ ఆస్పత్రి చెల్లించాల్సిన మూడేళ్ల పన్నును అధికారులు ఒకేసారి వసూలు చేశారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును రెవెన్యూ అధికారులు సీహెచ్.రామనారాయణ, ఎం.శ్రీకాంత్, ఆర్ఐలు సుభాన్, మోహన్, శివ జోనల్ కమిషనర్ పి.సింహాచలంకు అందజేశారు. ఈ సందర్భంగా వారిని జెడ్సీ అభినందించారు.